క్లుప్తంగా

పరిశ్రమపై ఫిర్యాదు



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మునిపల్లి(అందోల్): కలుషిత నీరు వదులుతున్న పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని ఉపతహసీల్దార్ ప్రదీప్‌ను హైద్లాపూర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం పార్టీ నాయకులతో కలిసి ఉపతహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పరిశ్రమ వదులుతున్న కలుషిత నీటితో వాగులోని చేపలు మృతి చెందుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎల్లయ్య సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ సీనియర్ కార్మిక నేత ఎల్లయ్య సేవలు మరువలేనివ కార్పొరేటర్ పుష్ప అన్నారు. సోమవారం బెల్ కాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్లయ్య సంతాప సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీహెచ్ఈఎల్ కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నూతనంగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రూ. 1.12 కోట్లతో ఆల్విన్ కాలనీ, జెపీ కాలనీ శిశు మందిర్ వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జేపీ కాలనీలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వెనకాల నిర్మిస్తున్న డ్రైయినేజీ పనులను పరిశీలించారు.

సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న సమాచారహక్కు కార్యకలాపాల బాధ్యులు

నారాయణఖేడ్: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని సూచించే బోర్డు ఏర్పాటు చేయాలని సోమవారం తహసీల్దార్ హసీనాబేగంకు సమాచార హక్కు చట్టం కార్యకలాపాల సొసైటీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, కార్యదర్శి శంకర్ వినతి పత్రం అందజేశారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సూచిక బోర్డులు లేకపోవడంతో చట్టం లక్ష్యం నీరుగారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల అందజేత



విద్యార్థులకు డ్రెస్సులు అందజేస్తున్న చైర్మన్, నాయకులు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ తరగతులకు చెందిన 140 విద్యార్థులకు నాయకులతో కలిసి డ్రెస్సులు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాల ఆకాంక్షించారు. అనంతరం హెచ్ఎం శ్రీనివాస్ నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సతీష్‌కుమార్, నాయకులు నర్సింలు, బస్వరాజ్ పాటిల్, జ్ఞానేశ్వర్, విఠల్, మహంకాళీ, కేదారీనాథ్, రాజుగౌడ్, ప్రభాకర్, ఉపాధ్యాయులు యాదవులు, తులసి, సల్మా, తదితరులు ఉన్నారు.

సమాజానికి మార్గదర్శకులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



రామచంద్రాపురం: ప్రిన్సిపాల్ రవీందర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులను అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. మండల స్థాయిలో 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన చంద్రకళ(మామిడ్గి), జ్యోతి, కిష్టయ్య, శ్వేత(న్యాల్‌కల్), సంజీవ్‌కుమార్, నవిత(మెటల్ కుంట), సుభాషిణి, యాదప్ప(హద్నూర్), కృష్ణ(రేజింతల్), భాస్కర్ నాయక్, అనిత(మిర్జాపూర్(బి)), యోహన్(ముంగి తండా), అరుణ(హుస్సేన్ నగర్), అంజన(రత్నాపూర్), ప్రవీణ(రాజోల), మహేష్(కల్బెమల్), షేక్ మహబూబ్(రాంతీర్థ్), పుణ్య (న్యామతాబాద్)లను ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ మారుతి రాథోడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాలు, పూల మాలలతో సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డిని సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ పిరంగుల సుజాత, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రదీప్ రెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నాయకుల సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు పొందిన బీహెచ్ఈఎల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌ను సోమవారం కళాశాలలో అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్ రావు, నరసింహులు, ఖలీల్, వరమ్మ, మసూద్, సురేష్, తుకారం రాథోడ్, సుధారాణి, రమ్య, సౌమిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

జహీరాబాద్: కోహీర్ మండలంలోని గురుజువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణ, హెచ్ఎం రజనీదేవి, ఉపాధ్యాయులు గురులింగయ్య, షేక్‌వలీ, ఎల్సీ, పద్మయ్య, శరణప్ప, స్వాతి, హెప్సిక తదితరులు పాల్గొన్నారు.



న్యాల్‌కల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు



మునిపల్లి: సన్మానిస్తున్న మాజీ ప్రజా ప్రతినిధులు



జహీరాబాద్: సత్కారం పొందిన ఉపాధ్యాయులు

ఓటరు జాబితాలో అభ్యంతరాల స్వీకరణ

సంగారెడ్డి టౌన్: ఓటరు జాబితాలో అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించామని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టు జాబితాపై సమావేశం

మునిపల్లి(అందోల్): ఎంపీటీసీ పరిధిలోని ఆయా గ్రామాల ఓటర్ లిస్టు జాబితా అభ్యంతరాలపై సోమవారం ఆయా పార్టీల నాయకులతో ఎంపీడీఓ హరినందన్ రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ సమావేశ మందిరంలో

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాల్లో అభ్యంతరాలు, ఇతర అంశాలపై ఎంపీడీఓ శ్రీనివాస్ చర్చించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, నరేష్, అశ్వన్‌పాటిల్, సందీప్‌లు హాజరయ్యారు. అయితే ఈ సమావేశానికి కాంగ్రెస్ నాయకులతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు హాజరుకాలేదు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదగిరి

పార్టీల నాయకులతో సమావేశం

నారాయణఖేడ్: మండల కేంద్రంలో ఎంపీడీఓ సంగ్రాం రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఓటర్ల జాబితా విషయాలను ఎంపీడీఓ వివరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆయా రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కసరత్తులో భాగంగా సోమవారం మండల స్థాయిలో ఎంపీడీఓ లక్ష్మి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, నాయకులు నాగేష్, హరీష్, తాజోద్దీన్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: చదువుతోపాటు క్రీడలు ముఖ్యమేనని, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులకు సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అండర్-14, అండర్-17, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజేత జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీర కదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. పటాన్‌చెరు కేంద్రంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయిలో పోటీ పడే క్రీడాకారులకు ట్రాక్ సూట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్ రావు నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుతో ఇబ్బంది పడుతున్నాం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని 1వ వార్డు గాంధీనగర్‌లో డంపింగ్ యార్డ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 2018 నుంచి డంపింగ్ యార్డ్ సమస్య నెలకొందని ప్రస్తుతం తీవ్రంగా మారడంతో కాలనీలో ప్రాణ భయంతో జీవతం కొనసాగిస్తున్నట్లు అధికారులతో వాపోయారు. డంపింగ్ యార్డ్‌తో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులను పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డ్ తరలింపు విషయంపై ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు చంద్రయ్య, రత్నం, కాలనీవాసులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఈ శిక్షణ సమయంలో వసతి, భోజనం పూర్తిగా ఉచితమని తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా చెందిన నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9704446956, 949012939 నంబర్లకు సంప్రదించాలన్నారు.

శ్మశానవాటిక పనులపై విచారణ చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్మశానవాటిలో జరిగిన అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు విచారణ చేయాలని బీఎస్పీ పార్టీ సీనియర్ నాయకుడు సుంకు వినయ్ కుమార్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని శ్మశానవాటిలో జరిగిన అభివృద్ధి పనులపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించామన్నారు. అధికారులు ఇప్పటివరకు సుమారు రూ.కోటి 90లక్షలతో అభివృద్ధి చేసినట్లు వివరాలు ఇచ్చామన్నారు. కానీ క్షేత్ర స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని సర్వే నెంబర్ 10లోని సీలింగ్ భూమి ఆక్రమణకు గురవుతోందని కాంగ్రెస్ నాయకుడు ఓంకార్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆక్రమణ అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సర్వే నంబర్లు ఇప్పటికే 170 ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. అయితే ఇందులో నుంచి 2013లో 18 ఎకరాలు ఓ వ్యక్తి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమార్కులు విలువైన భూములను కబ్జా చేసేందుకు పాల్పడుతున్నారని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూ.25 లక్షలు పలికిన బీరంగూడ లడ్డూ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో ఎన్ఎన్‌జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూ రికార్డు ధర పలికింది. గణేష్ నిమజ్జనంలో భాగంగా లడ్డు వేలం పాట నిర్వహించగా.. సాయిరాం నగర్ కాలనీకి చెందిన ఒగ్గు సాయి కిరణ్ యాదవ్ రూ.25,00,116లకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే సోదరులు గూడెం మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా ఆయనకు లడ్డూ అందజేశారు.

అక్షరాస్యతను పెంపొందించాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: నిరక్షరాస్యులైన వారికి అక్షరాస్యతను పెంపొందించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదవడతోపాటు రాయడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటేశం, డాక్టర్ కరుణ కుమారి, ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ సుజాత, డాక్టర్ మంజు, ఖాసీం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టీఎఫ్ నిధుల విడుదలపై నిరసన



ర్యాలీలో కళాశాల విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్‌టీఎఫ్ నిధులను విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ఆచార్య, వశిష్ట తదితర డిగ్రీ కళాశాలకు చెందిన 1,500 మంది విద్యార్థులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాల అధ్యక్షుడు సిద్దారెడ్డి మాట్లాడుతూ.. 4 ఏళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఆర్‌టీఎఫ్ విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు భిక్షాటన చేయాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య, వశిష్ట డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ హరికుమార్, డాక్టర్ సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

400 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం

నారాయణఖేడ్: పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మనూరు మండలం తోర్నాల్‌లో సోమవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో సింగూరు బ్యాక్‌వాటర్ కారణంగా 400 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు వెంటనే నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు విఠల్‌రావు, మాజీ సర్పంచ్ శివలింగప్ప, నాయకులు మోసిన్, దత్తురెడ్డి, కాశీనాథ్, గుండ్రెడ్డి తదితరులు ఉన్నారు.



పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు, ఏఐటీయూసీ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏఎన్‌ఎంలపై మోపిన పని భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంలు ప్రతిరోజు ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటూ వారి పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారన్నారు. అదే విధంగా సేకరించిన సమాచారాన్ని ప్రతిరోజు ఆన్‌లైన్ చేయాలని కోరుతూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు రాత్రంతా ఆన్‌లైన్‌లో వారి డీటెయిల్స్ రికార్డ్ చేయడం జరుగుతుందన్నారు. దీంతో ఏఎన్‌ఎంలు తీవ్రమైన పని ఒత్తిడి పెరిగి అనారోగ్య సమస్యలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘అభయహస్తం’ పథకాన్ని అమలు చేయాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయడంతో పాటు రాజీవ్ యువ వికాసం రుణాలను తక్షణమే మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దళితులందరికి చేవెళ్ల డిక్లరేషన్‌లో అంబేద్కర్ అభయహస్తం ద్వారా రూ.12లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ తర్వాత రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని దరఖాస్తులు స్వీకరించారన్నారు. జూన్ 2వ తేదీన ప్రారంభిస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. వెంటనే అర్హులైన వారందరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షులు రాజు, జయరాం, జిల్లా సహాయ కార్యదర్శి దాస్, నాయకులు మహేష్, గంగారాం బాలరాజ్, సురష్, నరేష్, శ్రీనివాస్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



అక్షరమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్ ఆధ్వర్యంలో చదువుతో కలిగే ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన తెలుగు అక్షరమాల ఆకృతి ఆకట్టుకుంది. కార్యక్రమంలో శివకుమార్, సుజాత, సువర్చల, రత్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పత్తిలో జింకు లోపంపై అవగాహన

కంగ్టి(నారాయణఖేడ్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలో జింకు లోపం కనిపిస్తుందని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. ఆయన పలు మండలాల్లో సోమవారం రైతుల పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. పంటలపై జింకు సల్ఫేట్ పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకుల ఈనెలు ఆకుపచ్చ రంగులో ఉండి మధ్యభాగం పసుపు రంగులోకి మారిందన్నారు. దీంతో ఆకులు చిన్నవిగా ముడుతలు పడి కణుపుల మధ్య దూరం తగ్గుతుందన్నారు. వీటి నివారణకు జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి ప్రతీ ఐదు రోజులకోసారి మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు.

◆ హరీశ్‌రావును కలిసిన నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీ మంత్రి హరీశ్‌రావును బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సీనియర్ నాయకుడు కృష్ణకాంత్ సోమవారం ఆయన నివాసంలో మార్యాదపూర్వకంగా కలిశారు.

◆ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



సంగారెడ్డి జోన్: నకిలీ పత్రాలు సృష్టించి, కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అమీన్‌పూర్ మున్సిపాలిటీ, కిష్టారెడ్డి పేట గ్రామ పరిధిలోని రెయిన్‌బో మిడోస్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఎండీఏ లేఔట్ ఉండడంతో ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. అయితే కొంతమంది నకిలీ సర్వే నంబర్లతో పాటు పత్రాలను సృష్టించి పొజిషన్‌లోకి వస్తున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ సహకరించాలి

కంగ్టి(నారాయణఖేడ్): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అన్నీ రాజకీయ పార్టీల నాయకుల సహకారం అవసరమని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లపై రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 70 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా , మండలంలో 36,033 మంది ఓటర్లు ఉండగా.. 18,111 మంది పురుషులు, 17,922 మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.